
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 229 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 15-3-2026 | Pages: 8 | Rs: 2/-

## కిమ్ కవ్వింపులు..
## ఒకేసారి 10 క్షిపణులు ఫైర్




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అమెరికా-దక్షిణ కొరియా వార్షిక సైనిక విన్యాసాల వేళ ఉత్తరకొరియా కవ్వింపులకు పాల్పడుతోంది. వరుసగా క్షిపణి ప్రయోగాలు చేపడుతూ బలప్రదర్శనకు దిగింది. శనివారం ఏకంగా 10 క్షిపణులను ఒకేసారి ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా మిలిటరీ వెల్లడించింది. ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా తెలిపింది. అయితే, ఇవి ఎంతదూరం ప్రయాణించాయో తమకు తెలియదని పేర్కొంది. మరోవైపు, జపాన్ రక్షణ శాఖ ఈ పరిణామాలపై స్పందించింది. కిమ్ సర్కారు ప్రయోగించిన ఆయుధాలు తమ దేశ ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్ వెలుపల ఉన్న

తరువాయి 2లో..

## మంత్రులూ బీ రెడీ...
# బాబు అలెర్ట్ !



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అటు పరిపాలనను చూసుకుంటోంది. ఇటు రాజకీయంగా కూడా తమదే పైచేయిగా ఉండాలని ఆరాటపడుతోంది. 2024 లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 56 శాతం పైగా ఓటు షేర్ కూటమికి దక్కింది. దాంతో దానిని నిలబెట్టుకోవడమే కాదు అవసరం అయితే ఆ నెంబర్ ని మరింతగా పెంచుకోవాలని చూస్తోంది. దానికి కారణం అధికారంలోకి వచ్చాక గత 21 నెలలలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చింది అని గట్టిగా చెబుతోంది. సూపర్ సిక్స్ హామీలను కూడా నూరు శాతం అమలు చేస్తున్నామని అంటోంది.

**విపక్షానికి నో చాన్స్ :**

ఏపీలో చూస్తే ప్రధానమైన మూడు పార్టీలు టీడీపీ జనసేన బీజేపీ ఒకటిగా కూటమి కట్టాయి. విపక్షంలో వైసీపీ ఒంటరిగా ఉంది. వామపక్షాలు, కాంగ్రెస్ అయితే ఉనికి పోరాటం చేస్తున్నాయి. దాంతో వైసీపీ మీదనే కూటమి రాజకీయ యుద్ధం

తరువాయి 2లో..

## యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

### కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం మోదీ అస్సాంలోని సిల్చార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన

తరువాయి 2లో..

## అనవసర ఆందోళనతో
# గ్యాస్ బుక్ చేయొద్దు

*సరిపోయే ఎల్పీజీ నిల్వలున్నాయి*

*నెట్‌వర్క్‌లు దగ్గరుంటే 'పీఎన్‌జీ'కి మారండి*

*ప్రజలకు కేంద్రం విజ్ఞప్తి*



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియా ఘర్షణలతో ఇంధన భయాలు నెలకొన్నవేళ.. దేశంలో ఎల్పీజీ కొరత లేదని కేంద్రప్రభుత్వం పునరుద్ఘాటించింది. గ్యాస్ గురించి ఆందోళన చెందవద్దని, దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి 30 శాతం పెరిగిందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ శుక్రవారం వెల్లడించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) నెట్‌వర్క్‌లకు దగ్గరున్న దాదాపు 60 లక్షల ఇళ్లు పీఎన్‌జీకి మారాలని, తద్వారా ఎల్పీజీపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రస్తుతం దేశంలో గ్యాస్ డిమాండ్‌లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని, అవసరం లేకపోయినా

తరువాయి 2లో..

## గిరిజనులు ఇబ్బంది పడుతుంటే
# తట్టుకోలేకపోయా

*గిరిపుత్రుల మధ్య పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్*

*సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు*



**పాడేరు, సిటిజన్ టైమ్స్**

గిరిజనుల కష్టాలను చూసి రహదారుల నిర్మాణానికి ముందుకొచ్చామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అల్లూరి జిల్లా నందిగరువులో గిరిజనులతో పవన్ కల్యాణ్ మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం సమస్యలు విన్న పరిస్థితులు కూడా లేవన్నారు. సరైన రహదారి లేకుండా గిరిజనులు ఇబ్బంది పడుతుంటే చూసి తట్టుకోలేకపోయానన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా.. తనతో పంచుకోవాలని కోరారు. ప్రజల కష్టాలు తీర్చేందుకే కూటమి ప్రభుత్వం

తరువాయి 2లో..



## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు
# ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అప్పర్ కృష్ణా జలాల ప్రాజెక్టు (యూకేపీ) మూడో దశ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలను బలంగా ఎదుర్కొనేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, మార్చి 17న ఢిల్లీలో రాష్ట్ర ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. శనివారం బాగల్‌కోట్‌లో ఆయన విలేకరులతో

తరువాయి 2లో..


## రెండు ఎల్పీజీ నౌకలు హార్ముజ్‌ను దాటాయి...

### వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు: కేంద్ర ప్రభుత్వం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హార్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హార్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హార్ముజ్‌ను దాటాయి. శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో

తరువాయి 2లో..



## రష్యా చమురు కొనుగోలుపై
# ఆంక్షలు సడలించిన అమెరికా

### భారత్ మాదిరి ఇతర దేశాలకు తాత్కాలిక మినహాయింపు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రపంచమంతా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో రష్యా చమురు కొనుగోలుపై విధించిన పలు ఆంక్షలను సడలిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. భారత్ మాదిరి పలు దేశాలు సైతం రవాణాకు సిద్ధంగా ఉన్న రష్యా చమురును కొనుగోలు చేయొచ్చని వెల్లడించింది. "అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకొచ్చి, ధరలను తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఇరాన్‌లోని తీవ్రవాద పాలన వల్ల

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# జనసేన- డిసైడింగ్ ఫ్యాక్టర్ గా !

ఏపీ రాజకీయాల్లో జనసే అతి కీలకమైన పార్టీగా ఉంది. ఈ మాట రాజకీయ విశ్లేషకులు సైతం చెబుతారు. జనసేన లేని ఏపీ రాజకీయాన్ని ఊహించుకోవడం వర్తమానంలో బహు కష్టం. ఏ పార్టీ అధికారంలో ఉండాలో ఏ పార్టీ గద్దె దిగి దూరంగా జరగాలో జనసేన నిర్ణయిస్తోంది. అలా డిసైడింగ్ ఫ్యాక్టర్ గా ఏపీ రాజకీయాల్లో జనసేన నిలిచింది. ఏపీలో ప్రధాన రాజకీయ పార్టీల జాతకాలను తారు మారు చేసే సత్తాను కలిగి ఉన్న జనసేన పాత్రను ఎవరూ ఏ మాత్రం విస్మరించేనిదిగా ఉంది. జనసేనను కాదనుకుంటే అధికారం లేదనుకున్నట్లే అని విభజన ఏపీలోని గడచిన మూడు ఎన్నికలూ నిరూపించాయి. ఇక జనసేన పార్టీ అన్నది పవన్ ఆవేశం నుంచి పుట్టింది. సినీ నటుడిగా మంచి హిట్ల మీద ఉన్న పవన్ కళ్యాణ్ 2014 మార్చి 14న హైదరాబాద్ లో కీలక సమావేశం పెట్టి చేసిన బిగ్ సౌండ్ జనసేన. తాను ఒక్కడిగా వేదిక మీదకు వచ్చి గంటన్నర సేపు మాట్లాడారు, ఆనాటి ఉమ్మడి ఏపీ విభజన రాజకీయాల నుంచి అనేక అంశాలను ఆయన ప్రస్తావించారు. ఒక్కొక్క మాట నిప్పు కణికగా మారింది. ఉమ్మడి ఏపీలోని నాటి ఎనిమిది కోట్ల మంది మనసులను అది తాకింది. పవన్ అలా ఒక నిర్ణయాత్మకమైన శక్తిగా రాజకీయంగా ప్రకటన చేసిన రోజే ఆవిర్భవించారు. విభజన ఏపీలో నాటి పరిస్థితి చూస్తే వైసీపీ మంచి ఊపు మీద ఉందనిపించింది. ఇక అధికారం ఆ పార్టీదే అన్నది అంతా అనుకున్న నేపథ్యం ఉంది. ఈ పరిస్థితుల్లో పవన్ జనసేన పెట్టిన వెంటనే గుజరాత్ వెళ్ళి ఆనాటి ముఖ్యమంత్రి బీజేపీ తరఫున ప్రధాని అభ్యర్థి అయిన నరేంద్ర మోడీని కలిశారు. బీజేపీకి ఆయన మద్దతు ప్రకటించారు. ఆ తరువాత టీడీపీతో కూడా స్నేహ హస్తం చాటారు. అలా మూడు పార్టీలు కలసి 2014 ఎన్నికల్లో జనంలోకి వెళ్ళాయి. తొలి ఎన్నికల్లో పవన్ జనసేన పోటీ చేయలేదు, మద్దతుగా నిలిచారు. విస్తృతంగా ప్రచారం చేసి పెట్టారు. దాంతో ఏపీలో బంపర్ మెజారిటీతో టీడీపీ బీజేపీ కాంబో గెలిచింది. ఇక 2019 నాటికి టీడీపీకి బీజేపీకి దూరంగా జనసేన జరిగింది. అలా కూటమి ఓట్లలో భారీ చీలిక వచ్చింది. ఆ నేపథ్యం అంతా వైసీపీకి ఎంతగానో ఉపయోగపడింది. వైసీపీ 151 సీట్లతో అద్భుతమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. దానికి పరోక్ష కారణం పవన్ అన్నది విస్మరించి వైసీపీ నేతలు అధినాయకత్వంతో సహా పవన్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ వచ్చారు. అయిదేళ్ళూ పవన్ వారికి టార్గెట్ అయ్యారు. అలా జనసేనను ఏమీ కాకుండా చూశారు లైట్ తీసుకున్నారు. దాంతో ఏపీలో కూటమి పునరేకీకరణ మొదలైంది. ఇక 2024 ఎన్నికల్లో కలసి పోటీ చేయాలన్నది పవన్ నిర్ణయం దానికి అటు బీజేపీ ఇటు టీడీపీ కూడా కలిసి రావడంతో 2024 ఎన్నికల ఫలితాలు అదిరిపోయే రేంజిలో వచ్చాయి. ఈ కూటమి పిడికిలి బిగిస్తే ఎలా ఉంటుందో వైసీపీకి తెలియచేసిన ఎన్నికలు అవి. 95 శాతం స్ట్రైక్ రేటు తో కూటమి పార్టీలకు సీట్లు దక్కాయి. ఓటు షేర్ కూడా 56 శాతానికి పైగా వచ్చింది. 21 సీట్లకు 21 జనసేన గెలుచుకుని రికార్డులు బద్ధలు కొట్టింది. అలా జనసేన చేయి కలిపితే ఎలా ఉంటుందో ఎదురు తిరిగితే ప్రత్యర్ధులకు స్థానం ఎక్కడ ఉంటుందో తెలియచేసిన ఎన్నికలుగా 2024 ని చెప్పుకోవాల్సిందే. జనసేన పార్టీ ప్రకటన చేస్తూ పవన్ అన్న మాట ఒకటి ఉంది. జనసేన లేకుండా తెలుగు రాజకీయాలు ఉండవని. ఆ మాటే శిలా శాసనం అయింది. మూడు ఎన్నికలు వరసగా ఏపీలో జరిగితే అవి అన్నీ పవన్ ఫ్యాక్టర్ చుట్టూనే తిరగడం విశేషం. ఆయన ప్లస్ అయితే ఒకలా మైనస్ అయితే ఒకలా రిజల్ట్ వచ్చింది. ఇప్పటికి కూడా ఒక మాట ఉంది పవన్ కూటమిలో ఉంటే వైసీపీ ఆ కూటమిని ఓడించడం కష్టమని. ఆ విషయం కూటమి పెద్దలకు కూడా తెలుసు అందుకే పవన్ ఏకంగా పదిహేనేళ్ళ పాటు కూటమి ప్రభుత్వం కొనసాగాలని బలంగా కోరుకుంటున్నారు. చంద్రబాబు లోకేష్ అదే మాటకు కట్టుబడి ఉన్నారు. అలా జనసేన 13 ఏళ్ళ ప్రస్థానం ఏపీ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసింది అనే చెప్పాలి. సినీ నటుడిగా ఉంటూ రాజకీయంగా సామాజిక అంశాల పరంగా ఇంత నిబద్ధత కనబరచిన వారు ఒక్క పవన్ తప్ప మరొకరు లేరు అంటే అతిశయోక్తి కాదని అంటారు. సో జనసేన జెండా రెపరెపల వెనక పవన్ ఆవేశం ఎపుడూ నిప్పులు చిమ్ముతూ సాగుతూనే ఉంటుంది.

## గిరిజనులు ఇబ్బంది పడుతుంటే

# తట్టుకోలేకపోయా

ఉందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఓనూరులో జల జీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిని పవన్ కల్యాణ్ పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి, అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. వారికి బ్యాగులు పంపిణీ చేశారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు.

**గిరిపుత్రుల మధ్య పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో పర్యటిస్తున్నారు. ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన వెళ్లారు. అనంతరం రోడ్డు పనులు పరిశీలించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఓనూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంఛార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా పవన్‌కు స్థానిక మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. పవన్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు.

**సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు**

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం శుభాభినందనలు తెలిపారు. పవన్‌కు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజాజీవితాల్లో భాగం కావడం సంతోషమన్నారు.

## అప్పర్ కృష్ణా ప్రాజెక్టు

# ఏపీపై పోరుకు కర్ణాటక వ్యూహం

మాట్లాడుతూ.. అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, దానికి సంబంధించిన భూసేకరణను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై కేంద్రం తమ నుంచి వివరణ కోరిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఏపీ వైఖరికి వ్యతిరేకంగా తమ వాదనను ఢిల్లీలో బలంగా వినిపిస్తామని శివకుమార్ స్పష్టం చేశారు. "ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే మాకు కేటాయించిన నీటి వాటాను వినియోగించుకోవడానికి ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచే ఆలోచన లేదు. కేవలం మా వాటా నీటిని వాడుకోవడానికే ప్రయత్నిస్తుంటే, దానికి కూడా ఏపీ అభ్యంతరం చెప్పడం సరికాదు" అని ఆయన అన్నారు. ఇదే సమయంలో, తుంగభద్ర డ్యాం నుంచి కర్ణాటకకు చెందిన సుమారు 30 టీఎంసీల నీరు వృథాగా పోతోందని, ఈ వృథాను అరికట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం సహకరించడం లేదని శివకుమార్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని ఖరారు చేసేందుకు తాను, మంత్రులు హెచ్.కే. పాటిల్, ఎం.బి. పాటిల్, బోసరాజులతో కలిసి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ఎంపీలతో ఈ సమావేశం జరగనుంది.

## మంత్రులూ బీ రెడీ...

# బాబు అలెర్ట్ !

అంతా చేస్తోంది. ఆ పార్టీకి 2024 ఎన్నికల్లో దాదాపుగా నలభై శాతం ఓటు షేర్ దక్కింది. దాంతో వైసీపీని లైట్ తీసుకోరాదని భావిస్తోంది. ఇక ఏపీలో కూటమి బలంగా ఉందని ప్రభుత్వం పనితీరు పట్ల జనంలో సంతృప్తిగా ఉందని కూడా పెద్దలు నమ్ముతున్నారు ఈ నేపథ్యంలోనే మరిన్ని విజయాలను నమోదు చేయడం ద్వారా వైసీపీని నైతికంగా దెబ్బ తీయాలని అనుకుంటున్నారు.

**గెలుపు మనదే :**

ఇక స్థానిక సంస్థల ఎన్నికలు ఏపీలో ఉన్నాయి. ఈ నెలలో కార్పోరేషన్లు, మునిసిపాలిటీలు, ఏప్రిల్ 2న పంచాయతీలకు పదవీ కాలం ముగిసిపోతోంది. ఇక జూన్ నాటికి మండల జిల్లా పరిషత్తులకు పదవీ కాలం ముగుస్తోంది. అంటే మరో మూడు నెలలలో మొత్తం లోకల్ బాడీస్ లో ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రభుత్వాలకు గడువు పూర్తి అయిపోతుంది అన్న మాట. దాంతో ఎన్నికలు తిరిగి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ప్రత్యేక అధికారులను అంతటా నియమించారు. ఈ క్రమంలో చంద్రబాబు తాజాగా నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో లోకల్ బాడీ ఎన్నికల గురించి మాట్లాడుతూ గెలుపు మనదే అని స్పష్టం చేశారు.

**అంతా సిద్ధం కావాలి :** మరో ఆరు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని చంద్రబాబు మంత్రులకు సూచనాప్రాయంగా చెప్పారు. అందువల్ల ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రతీ ఎన్నికలోనూ గెలుస్తూ ఉన్నాం, స్థానిక ఎన్నికల్లోనూ గెలిచి తీరాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ విషయంలో అంతా అప్రమత్తంగా ఉండాలని బాబు సూచించారు అని అంటున్నారు.

**మరో మినీ యుద్ధం :** స్థానిక సంస్థలకు ఎన్నికలు అంటే మినీ యుద్ధం అని అంటున్నారు. 2024 తరువాత జరిగే అతి పెద్ద ఎన్నికలుగా వీటిని చూస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత బాగా ఉందని వైసీపీ అంటోంది. కానీ లోకల్ బాడీస్ లో వైసీపీ ఏ మేరకు విజయాలను నమోదు చేస్తుంది అన్నది చర్చనీయాంశం అవుతోంది. ఇక అధికార కూటమిలో మూడు పార్టీలూ స్థానిక ఎన్నికల మీద ఎంతో ఆశగా ఉన్నాయి. ఇప్పటికే గ్రౌండ్ లెవెల్ లో ఆయా పార్టీల ఆశావహులు అంతా రెడీగా ఉన్నారు. దాంతో స్థానిక ఎన్నికలను సరైన సమయంలో నిర్వహించి మొత్తానికి మొత్తం ఫలితాలను తమ పరం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉంది అని అంటున్నారు.

## రష్యా చమురు కొనుగోలుపై

# ఆంక్షలు సడలించిన అమెరికా

పొంచి ఉన్న ముప్పు, అస్థిరతను అరికట్టేందుకు ఆయన కృషి చేస్తున్నారు. రవాణాకు సిద్ధంగా ఉన్న రష్యా చమురును కొనేందుకు పలు దేశాలకు అమెరికా తాత్కాలిక అనుమతినిస్తోంది. ఇప్పటికే రవాణాలో ఉన్న చమురుకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఇది రష్యాకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాన్ని అందించదు" అని 'ఎక్స్'లో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పోస్ట్‌చేశారు. ఈ పరిణామాలపై రష్యా స్పందించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు రష్యా చమురు ఎంత కీలకమో తాజా ప్రకటనతో వెల్లడైందని పేర్కొంది.

**రష్యాకు ఊహించని లాభాలు..:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన ధరలు పెరగడంతో పుతిన్ ప్రభుత్వానికి బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు పలు కథనాలు వెల్లడించాయి. యుద్ధం ప్రారంభమైనప్పట్నుంచి 6 బిలియన్ డాలర్లు.. అంటే రోజుకు దాదాపు 400 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,700 కోట్లు) అదనపు ఆదాయాన్ని ఆర్జించిందని అమెరికా సెనెటర్ ఆంగస్ కింగ్ తెలిపారు.

# కిడ్నీ బాధితునికి వైసిపి నేత రమణారావు ఆర్థిక సాయం

**ఉప్పలగుప్తం. సిటిజన్ టైమ్స్ మార్చి 14**



చల్లపల్లి పంచాయితీ ఊరపేటకు చెందిన రొక్కాల రామస్వామి కిడ్నీ ఆపరేషన్ జరిగి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. రామస్వామిని శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. రామస్వామి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని అతనికి ఆర్థిక సాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక సాయం అందించిన రమణారావుకు రామస్వామి అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్,మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,వైసిపి నాయకులు నేలపూడి సుగంధ కుమార్, నేరేడుమిల్లి శ్రీను,పందిరి సుబ్బరాజు,పరమట రాజశేఖర్,మాకే సిద్దు,గూటం సాయి,గంటి చిరంజీవి,కాత్రు మధు,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

విపక్షాలపై మండిపడ్డారు. 'యుద్ధం నేపథ్యంలో దేశ పౌరులపై ప్రభావం పడకుండా ఉండేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ (జశీఅస్త్రతీవం) బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుందని భావించాం. కానీ, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో అది మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలా భయాలు సృష్టించి.. నన్ను వేధించాలని చూస్తున్నారు' అని మోదీ విమర్శలు చేశారు. భారతదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అస్సాం ప్రజలను ఉద్దేశిస్తూ.. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుందన్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్ (ూ× ాబఎఎతీ)లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

## అనవసర ఆందోళనతో

# గ్యాస్ బుక్ చేయొద్దు

ఆందోళనతో బుకింగ్‌లు చేయొద్దని సూచించారు. 'యుద్ధానికి ముందు.. రోజుకు 55.7 లక్షల సిలిండర్లు బుక్ అయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం 75.7 లక్షలకు పెరిగింది. అంటే ఆందోళనతో బుకింగ్‌లు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. 'ముడిచమురు విషయానికొస్తే.. మనవద్ద 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ సామర్థ్యం ఉంది. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాం. ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితంగా దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. మన రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన పని లేదు' అని భరోసానిచ్చారు. మరోవైపు, ఎల్పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. గ్యాస్ కొరతతో గ్రామీణ ప్రజలు చెక్క, బొగ్గులతో వంటచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇదే కొనసాగితే అది మరో సవాలుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

**అనేక రాష్ట్రాల్లో అస్తవ్యస్తం!**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా ఏర్పడిన వంట, వాణిజ్య గ్యాస్ సిలిండర్‌ల కొరత వివిధ రాష్ట్రాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఎల్పీజీలకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతోన్నా.. ఆస్పత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, వసతి గృహాలు మొదలైన చోట్ల పరిస్థితి మరింత తీవ్రమైంది. కొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్‌లను సాధారణం కంటే రెండు, మూడు రెట్ల మేర ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వంట చెరకు ధరలకు కూడా రెక్కలొచ్చాయి. మరికొన్ని చోట్ల సిలిండర్‌లను దొంగిలిస్తోన్న ఉదంతాలూ వెలుగులోకి రావడం గమనార్హం.

## కిమ్ కవ్వింపులు..

# ఒకేసారి 10 క్షిపణులు ఫైర్

సముద్ర జలాల్లో పడినట్లు తెలిపింది. ఈ వారం ఆరంభంలోనూ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేపట్టింది. ఓ యుద్ధనౌక నుంచి తన తీరానికి సమీపంలోని దీవులపై క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఆ ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి కాన్ఫరెన్స్ హాలులో కూర్చుని వీక్షించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ వెల్లడించింది. తమ దేశంపై అణ్వస్త్ర దాడి ముప్పును నిరోధించడానికే ఈ శక్తిమంతమైన క్షిపణులతో ప్రయోగాలు చేస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు.

# రెండు ఎల్పీజీ నౌకలు హార్ముజ్‌ను దాటాయి...

సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**వంట గ్యాస్ విషయంలో ఇబ్బంది లేదు..:** గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. వాణిజ్య సిలిండర్ల కొరతపై కూడా కేంద్రం స్పందించింది. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. బుకింగ్ కోసం గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని గుర్తు చేసింది. గల్ఫ్‌లో ఉండిపోయిన భారతీయ నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అందులోని సిబ్బంది కూడా సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. హార్ముజ్ జలసంధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. నావికుల కుటుంబ సభ్యులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని తెలిపింది.

## సింహాచల క్షేత్రంలో ధ్వజస్తంభ పీఠానికి స్వర్ణ తాపడ పనుల ప్రారంభం





**సింహాచలం, మార్చి 14, సిటిజన్ టైమ్స్**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి దేవాలయం ముందున్న ధ్వజస్తంభం పీఠానికి పూర్తిస్థాయిలో స్వర్ణ తాపడం (బంగారు పూత) చేసే పనులు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి స్వర్ణ తాపడ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి బి. సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఏడేళ్ల క్రితం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించిన సంగతి తెలిసిందే. అప్పట్లో సీఎంఆర్ (జవీ=) సంస్థ సుమారు రూ. 1.8 కోట్లు వెచ్చించి ధ్వజస్తంభానికి స్వర్ణ తాపడం చేయించింది. ఇప్పుడు అదే సంస్థ ధ్వజస్తంభం అడుగు భాగంలోని పీఠానికి కూడా స్వర్ణ తాపడం చేసేందుకు ముందుకు వచ్చింది. నేటి నుంచి ప్రారంభమైన ఈ పనుల్లో భాగంగా, పీఠానికి ఎంత బంగారం అవసరమవుతుందనే దానిపై కార్మికులు ఇప్పటికే కొలతలు తీసుకోవడం ప్రారంభించారు. త్వరలోనే ఈ పనులను పూర్తి చేసి ధ్వజస్తంభాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్ లో 1046 కేసులు పరిష్కారం




**యలమంచిలి, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

సీనియర్ సివిల్ జడ్జ్ పి. విజయ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. రమేష్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో బాగంగా శనివారం 1046 కేసులు పరిష్కరించడం జరిగిందని, రాజీ పరిష్కారనిమిత్తం 56,33,312 రూపాయలు కక్షి దారులకి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ ఎల్ వి ఆర్ కె లాలం వెంకట రామకృష్ణారావు, లోక్ అదాలత్ సభ్యులు ప్యానల్ లాయర్లు పి సుభాషిని, పి ఆదిలక్ష్మి, నారాయణ, సోషల్ వర్కర్లు కే చిరంజీవి, ఎస్ నాగేశ్వరరావు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షి దారులు పాల్గొన్నారు.

## జూదం ఆడుతున్న ఐదుగురు అరెస్ట్, రూ.6,200/- నగదు స్వాధీనం



**కశింకోట,సిటిజన్ టైమ్స్ మార్చి 14**

అనకాపల్లి జిల్లా కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో జూదంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కశింకోట సీఐ ఎ.స్వామి నాయుడు మార్గదర్శకత్వంలో, ఎస్ఐ మనోజ్ కుమార్ మరియు సిబ్బందికి అందిన ముందస్తు సమాచారం మేరకు తాళ్లపాలెం గ్రామ శివారులో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతూ జూదానికి పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 52 పేక ముక్కలు మరియు రూ.6,200/- నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి అక్రమ జూద కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

### అనకాపల్లిలో మహిళా పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన -జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్







**అనకాపల్లి,సిటిజన్ టైమ్స్,మార్చి 14**

పరిశ్రమల ఏర్పాటులో మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించి, ఆర్థిక సాధికారత సాధించేందుకు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడే శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం, కోడూరులోని ఏపీఐఐసీ షెడ్లో ఎంఎస్ఎంఈ పార్కు సమీపంలో ఏఎల్ఏపీకి సుమారు 31.77 ఎకరాలలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిండంతో, ఎలిప్ మహిళా శక్తి భవన్ పరిపాలన భవనం, శిక్షణ కార్యాలయాన్ని నిర్మించేందుకు శనివారం ఉదయం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, ఎలీప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి లతో కలసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళా సాధికారత దిశగా కీలక అడుగు పడిందని, సుమారు 31.77 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్న మహిళా పారిశ్రామిక పార్కుకు నేడు ఘనంగా శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నాటికి రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని, అందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. మహిళలు తమలో ఉన్న ఆలోచనలను వ్యాపార రూపంలోకి మార్చుకోవాలని, అందుకు ప్రభుత్వం మరియు ఎలిప్ వంటి సంస్థలు పూర్తి సహకారం అందిస్తాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలిప్ సంస్థ అందిస్తున్న శిక్షణ మరియు మార్గదర్శకత్వం ఎంతో కీలకమని కలెక్టర్ కొనియాడారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ప్రభుత్వం**

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చే ప్రాధాన్యతకు ఈ పారిశ్రామిక పార్కు ఒక నిదర్శనమని అన్నారు.మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు మరియు అన్ని రంగాల్లో వారికి అవసరమైన తోడ్పాటును ఈ పార్కు ద్వారా అందించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారీ సబ్సిడీని ముఖ్యమంత్రి ప్రకటించారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం శుభపరిణామమని, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ సమిష్టిగా కృషి చేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో ఎలిప్ సంస్థ అందిస్తున్న శిక్షణ మరియు తోడ్పాటును అభినందించారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, దీనిని మహిళలు అందిపుచ్చుకోవాలని కోరారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లా సురేంద్ర, మాట్లాడుతూ మహిళా సాధికారతకు - సామాజిక అభివృద్ధి మరియు భవిష్యత్తుకి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎలిప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి, మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు గుడ్ న్యూస్..

# నాలుగు ప్రత్యేక రైళ్లు ఇక రెగ్యులర్!



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 14::**

రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. డిమాండ్ మేరకు నడుపుతున్న నాలుగు ప్రత్యేక రైళ్లను ఇకపై రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి మెరుగైన కనెక్టివిటీ లభించనుంది.

రెగ్యులర్ కానున్న రైళ్ల వివరాలు:

**1 విశాఖపట్నం - తిరుపతి (18507/18508):**

షెడ్యూల్: ప్రతి సోమవారం రాత్రి 19.10 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 09.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి మంగళవారం రాత్రి 21.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

ఆగు స్టేషన్లు: దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది.

**2. విశాఖపట్నం -- తిరుపతి (18505/18506):**

షెడ్యూల్: ప్రతి బుధవారం రాత్రి 19.00 గంటలకు విశాఖలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 09.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి గురువారం రాత్రి 21.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

**3. విశాఖపట్నం -- బెంగళూరు (18509/18510):**

షెడ్యూల్: ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15.20 గంటలకు విశాఖలో బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం 13.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణం: ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి, మంగళవారం మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

**4. విశాఖపట్నం -- చర్లపల్లి (హైదరాబాద్) (18527/18528):**

షెడ్యూల్: ప్రతి శుక్రవారం సాయంత్రం 17.30 గంటలకు విశాఖలో బయలుదేరి, శనివారం ఉదయం 08.00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.


తిరుగు ప్రయాణం: ప్రతి శనివారం మధ్యాహ్నం 14.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి, ఆదివారం తెల్లవారుజామున 05.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైళ్లు రెగ్యులర్ సర్వీసులుగా అందుబాటులోకి వచ్చే తేదీలను త్వరలోనే రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించనుంది. కోచ్‌లలో 2ఏసీ , 3ఏసీ , స్లీపర్ మరియు జనరల్ క్లాస్ సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయి.

# పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

### జిల్లాలో మొత్తం 133 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 28,983 మంది విద్యార్థులు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 14:**

పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం విద్యాశాఖ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ?పదవ తరగతి పరీక్షలు మార్చి 16, 2026 నుండి ప్రారంభమై ఏప్రిల్ 01, 2026 వరకు జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయని, ౹ూా మరియు చీూ (మార్చి 25 మరియు 28 తేదీలలో) పరీక్షలు మాత్రం ఉదయం 9:30 నుండి 11:30 వరకు మాత్రమే జరుగుతాయని తెలిపారు. విద్యార్థులను ఉదయం 9:00 గంటల నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఉదయం 10:00 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. మన జిల్లాలో 456 పాఠశాలల నుండి 15,292 మంది బాలురు, 13,691 మంది బాలికలు వెరసి మొత్తం 28,983 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ?జిల్లాలో మొత్తం 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ?ప్రతి కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్ మరియు ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించా మన్నారు. ?మొత్తం 1,634 మంది ఇన్విజిలేటర్లను నియమించగా, వీరిలో 20% మంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ?సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 8 కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే



సదుపాయం కల్పించారని తెలియజేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను నేరుగా వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్ ద్వారా గానీ, 'లీప్' యాప్ ద్వారా తమ పెన్ నంబర్ ఉపయోగించి ఆన్‌లైన్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిపై ఎటువంటి అధికారుల సంతకం అవసరం లేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ మరియు ఫర్నిచర్ వంటి కనీస సౌకర్యాలను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు మరియు హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం 260 మంది స్క్రైబ్స్ అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు. కలెక్టర్ గారి ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పాయకరావుపేట నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు**

**మహిళలతో కలిసి నమాజ్ లో పాల్గొన్న మంత్రి**





**నక్కపల్లి, సిటిజన్ టైమ్స్,మర్చి 14**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పాయకరావుపేట నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నక్కపల్లిలోని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద ఈ కార్యక్రమం ఆమె ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పాయకరావుపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి ముస్లిం మహిళలతో కలిసి నమాజ్ నిర్వహించడంతో పాటు ముస్లిం సోదరులు, సోదరీమణులకు రంజాన్ తోఫాలను అందజేశారు. చిన్నారులతో మంత్రి అనిత సరదాగా ముచ్చటిస్తూ వారికి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన కాలమని తెలిపారు. ఈ నెలలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈ పవిత్ర సమయంలో ముస్లిం సోదరులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం తనకు ఒక కుటుంబంలాంటిదని పేర్కొన్న మంత్రి, నియోజకవర్గంలోని 27 మసీదులకు చెందిన ముస్లింలు సామూహిక నమాజ్ నిర్వహించుకునేందుకు అవసరమైన వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. దశలవారీగా షాదీఖానాలు కూడా నిర్మిస్తామని వెల్లడించారు. మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో రూ.6,090 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఉర్దూ అకాడమీకి రూ.7 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అదేవిధంగా ఈ నెల 23న నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం త్వరలో మరో జంషెడ్పూర్‌లా అభివృద్ధి చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, జీవితంలో మహోన్నత స్థాయికి ఎదగాలని మంత్రి అనిత ఆకాంక్షించారు.

# నగరంలో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన

**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు,వివిఎమ్ఆర్డిఏ చైర్మన్ ప్రణవ గోపాల్,అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి**

**సీతమ్మధార , ఏ ఎస్ ఆర్ నగర్ లో మురికివాడ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ**

**మురికివాడ లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గంటా**









**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మార్చి 14**

విశాఖ నగరంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ విఎమ్ఆర్డిఏ మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించి, భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు దాదాపు పూర్తి చేస్తామని,సీతమ్మధార ,ఏఎస్ ఆర్ నగర్ లో మురికివాడను ఆధునీకరిస్తామని పేర్కొన్నారు.శనివారం ఆయన , భోగాపురం విమానాశ్రయం అనుసంధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను, విశాఖపట్నం సీతమ్మధారలోని ఉన్న ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంతాన్ని భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, బిఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో ముందుగా మున్సిపల్ శాఖ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు సీతమ్మధార ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ నివసిస్తున్న నివాసితులతో మాట్లాడుతూ వారికి కల్పించవలసిన అవసరాలు, మౌలిక సదుపాయాలు, ఎన్ని సంవత్సరాలు నుండి ఆ ప్రాంతంలో నివసిస్తున్నారని, వారి వృత్తులు మొదలైనవి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఈ ప్రాంతంలో 3.2 ఎకరాల స్థలంలో 200 కుటుంబాలతో 30 సంవత్సరాల నుండి కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నామని, మా ఇళ్లకు ఎటువంటి పట్టాలు లేవని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని మంత్రి దృష్టికి నివాసితులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి మాట్లాడుతూ ఏ ఎస్ ఆర్ నగర్ లోని మురికివాడ ప్రాంత ప్రజలు గత 30 ఏళ్ల నుండి నివసిస్తున్నట్లు తెలిపారని, వారు నివాసం ఉంటున్న భూమి కి ఎటువంటి పట్టాలు లేవని, కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ భూమి మా సొంతమని వారిని బెదిరిస్తున్నారని స్థానికులు వెల్లడించారని మంత్రి తెలిపారు. సీతమ్మధార ఘూ= నగర్ లో మురికివాడను ఆధునీకరిస్తామని,ప్రైవేటు భూమిలో ఏళ్ళతరబడి సుమారు 200 కుటుంబాలు తాత్కాలిక ఇళ్లు, షెడ్ లు నిర్మించుకుని నివసిస్తున్నారని, ఇళ్లు తొలగిస్తామని అధికారులు,స్థలం యజమానులు బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారని, భూమి యజమానులతో మాట్లాడి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు ఇదే ప్రాంతంలో పిపిపి పద్ధతిలో ఇల్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఎవరైతే ఈ భూమి మా సొంతం అంటున్నారో వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి అవసరమైన చర్యలు నివాసితులకు , ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కార మార్గం చూపే చర్యలు చేపట్టాలని కమిషనర్ కు మంత్రి సూచించారు. అనంతరం నేరెళ్ళ వలస నుంచి కొత్తవలస,బోయపాలెం నుంచి కాపులుప్పాడ,భీమిలి నుంచి దొరతోట జంక్షన్ కి వెళ్ళే రోడ్లు పరిశీలించారు. భోగాపురం ఎయిర్పోర్ట్ అనుసంధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించి ఎయిర్పోర్ట్ ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు దాదాపు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే విశాఖపట్నం నుంచి ఎయిర్పోర్ట్ కు వెళ్లేందుకు వీలుగా రోడ్లు నిర్మిస్తున్నామని, 54 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వి ఎం ఆర్ డి ఏ, ఆర్ అండ్ బీ,జీవీఎంసీ సంయుక్త కార్యాచరణతో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నాయి అన్నారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఏ ప్రభాకర్ రావు, బిఎంఆర్డిఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ మొదటివారంలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

**భీమిలి ఎమ్మెల్యే గంటా**





**కొమ్మాది, సిటిజన్ టైమ్స్,మార్చి 14:**

ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ కు వచ్చే నెల మొదటి వారంలో శంకుస్థాపన చేయనున్నట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అమెరికాయేతర ప్రాంతాల్లో గూగుల్ డేటా సెంటర్ కు ఇది హెడ్ క్వార్టర్ గా ఉంటుందని పేర్కొన్నారు. కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ కాలేజీ రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి లోకేష్ నాయకత్వంలో విశాఖ ఐటీకి కేరాఫ్ అడ్రస్ కానుందన్నారు. పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా విశాఖలో ఒకేసారి 15 అంతర్జాతీయ ఐటీ కంపెనీలకు లోకేష్ శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఐటీ కొలువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విశాఖకు ప్రఖ్యాత కంపెనీలు తీసుకువస్తున్నామన్నారు. తను నడుపుతున్న విద్యా సంస్థల పేరును ఇంటి పేరుగా మార్చుకున్న చైతన్య రాజు, 1999లో తాను అనకాపల్లి ఎంపీగా పోటీ చేసినప్పుడు పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారని రాజుతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి అహర్నిశలు కష్టపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, గరే గుర్నాథ్, మన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, మామిడి దుర్గారావు, చెట్టుపల్లి సన్యాసిరావు, బోయి రమాదేవి, లొడగల జానకిరామ్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురం నుండి తిరుపతి వరకు దివ్యాంగుడి సైకిల్ యాత్ర..

**– మద్దతు తెలిపిన రాష్ట్ర కార్యదర్శి రంగనాయకులు**



**సిటిజన్ టైమ్స్, మార్చి 14:– రాంబిల్లి**

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం, కనికం మండలం బూర్గం గ్రామానికి చెందిన దివ్యాంకుడైన నెయ్యిల ప్రసాద్ సంకల్పం, స్వామి పై భక్తి, పార్టీపై విధేయత, నాయకుడు పై అభిమానం వీటి ముందు తనకున్న శారీరక లోపం చిన్నబోయింది.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజలు సుభిక్షంగా ఉంటారని, తన దివ్యాంగాన్ని కూడా లెక్క చేయకుండా తిరుపతి వరకు పాదయాత్ర చేస్తానని ఏడుకొండల స్వామి వారికి మొక్కుకొని, తర్వాత మొక్కవోని పట్టుదలతో, మొక్కుతీర్చుకొనుటకు సైకిల్ యాత్ర చేపట్టి సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రారంభించారు. యాత్ర రాంబిల్లి మండలం, హరిపురం కు చేరుకొనగా రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయుకులు నెయ్యిల ప్రసాద్ కి స్వాగతం పలికి సన్మానం చేసి, అభినందించి తగు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిల్లాడి శ్రీను, పార్టీ ప్రధాన కార్యదర్శి దేవర శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయుకులు ధూళి పరమేష్, ఐటీడీపి ధూళి నూకరాజు, జోగా లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూలకంటి బ్రహ్మారెడ్డికి ధన్యవాదాలు తెలుపుకుంటున్న జంగాల కాలనీ వాసులు

**మాచర్ల, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

జంగాల కాలనీలో రెండు దశాబ్దాలుగా సీసీ రోడ్లు లేకుండా ఆ కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు, అటుగా వచ్చిన జూలకంటి బ్రహ్మారెడ్డి చూసి ఏమయ్యా మీకు రోడ్లు లేవా ? మోకాటి నీళ్లల్లో ఎలా నడుస్తున్నారని అడిగి వాళ్ళ బాధలు తెలుసుకున్నారు, వాళ్ల బాధలు కష్టాలు చూడలేక చలించిపోయి, దుర్గి నాయకులను అడిగి తెలుసుకుని సిరిమామిళ్ల కృష్ణయ్య బిజెపి సీనియర్ నాయకులు వెలిదండి శ్రీనివాసరావు కాలనీవాసులు వెంటనే కూటమి ప్రభుత్వానికి విన్నవించి సిసి రోడ్లు వేయించారు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సహకారంతోటి మరియు చిరుమామల కిష్టయ్య, ఆధ్వర్యంలో జరిగింది, ఉప్పల ఆంజనేయులు,కోడి రామకృష్ణ, జంగాలని కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఏడేళ్ల చిన్నారికి రూ.2 లక్షల సాయం

## వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత ఆపన్నహస్తం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

విశాఖపట్నం పర్యటనలో భాగంగా ఈ నెల 4వ తేదీన నగరానికి వచ్చిన సందర్భంగా, 39వ వార్డుకు చెందిన ఏడేళ్ల చిన్నారి జోయ మహమ్మద్ తీవ్ర బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న పరిస్థితిని ఆమె తండ్రి ఎండీ హఫీజ్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి కి వివరించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన జగన్ , ఆ చిన్నారి వైద్య చికిత్స కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ రోజు ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న వారి నివాసానికి వెళ్లిన జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కలిసి రూ.2 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కేకే రాజు మాట్లాడుతూ... వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటిలో ఆయన కుమారుడి వివాహ వేడుకల సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించేందుకు వచ్చిన సమయంలో చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా తీవ్రమైన వ్యాధితో బాధపడుతూ కమ్యూనికేషన్ సమస్యలతో ఉన్న ఆ చిన్నారిని 2023లో వాసుపల్లి గణేష్ కుమార్ స్వయంగా వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. అదే సమయంలో చిన్నారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించేందుకు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి తో మాట్లాడి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా సుమారు రూ.18 లక్షలు మంజూరు చేసి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ చిన్నారి ప్రాణాలు నిలబడ్డాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం..కూటమి ప్రభుత్వం అధికారం చెప్పడం జరిగింది. చికిత్స కోసం మంజూరు చేసిన డబ్బులు రానివకుడా ఆపివేశారు. చిన్నారి తండ్రి రేషన డిపో డ్రైవర్ గా , తల్లి వాలంటీర్ గా పని చేసువారు కాని ఎప్పుడు అవికూడా ఈ ప్రభుత్వ అప్పి వేయడం తో ప్రస్తుతం ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వారి జీవనోపాధి కూడా దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వ వ్యవస్థలు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య శాఖలో జరుగుతున్న నిర్లక్ష్యం, అవినీతి కారణంగా సాధారణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని స్పందించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. మీడియా సమావేశాలు, ప్రచారాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వచ్చి వారి పరిస్థితులను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ని కోరారు. ఈ సంఘటన రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్య సేవలు, జీవనోపాధి కోల్పోయి ఎలా ఇబ్బందులు పడుతున్నారనే దానికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత తీసుకుని, నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ...:** రాష్ట్రంలో ఇలాంటి బాధిత కుటుంబాలు ఎన్నో ఉన్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నార లోకేష్ కళ్ళు తెరిచి ప్రజల పరిస్థితిని చూడాలని కోరారు. ఇలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవడంలోనే నిజమైన గొప్పతనం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి హయాంలో "నావల్ల ఎవరికీ అన్యాయం జరగకూడదు, ఎవరికీ నష్టం కలగకూడదు" అనే బాధ్యతతో పాలన సాగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స కోసం వెళ్లే రోగులకు అవకాశం లేదని చెబుతూ తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా డబ్బులు చెల్లించండి, తరువాత బిల్లులు పెట్టుకోండి అని చెప్పడం పేదలకు పెద్ద భారమవుతోందన్నారు. అలాగే విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో వైద్యులపై అధిక ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ఒక రోజులో సాధారణంగా నాలుగు ఆపరేషన్లు జరిగే చోట 13 ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తగినంత మంది వైద్యులు, నర్సులు లేకపోవడం వల్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, ఎస్.ఇ.సి సభ్యులు జహీర్ అహ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజు గాంధీ, జోనల్, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు ముత్తం సునీల్, అంబటి శైలేష్, బోండా ఉమామహేశ్వరరావు, పేలా ప్రేమ్ కిరణ్, వార్డు అధ్యక్షులు ముజుబ్ ఖాన్, బొడ్డేటి ప్రసాద్, అల్లాను కనక రెడ్డి, పార్టీ నాయుకులు ఎస్.కే బాబ్జి , పొంతిన హరికృష్ణ, సత్య , మాదిరి , శ్రీను, రమన్ , సాయి , చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్ష

**జిల్లా వ్యాప్తంగా 700 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ,**

**హాజరు కానున్న 70,090 మంది అభ్యర్థులు**

**పరీక్షలను సమన్వయంతో విజయవంతం చేయాలి:**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

విశాఖపట్నం జిల్లాలో ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్షను ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు సుమారు 70,090 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అన్ని మండలాలు, జోన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సుమారు 700 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని పరీక్షలకు హాజరై విశాఖపట్నం జిల్లాను శాతం శాతం అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి దృవపత్రాలు (సర్టిఫికెట్లు) అందజేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇలాకాలో అంబరాన్నంటిన జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు....

పిఠాపురం గడ్డ పవన్ కళ్యాణ్ అడ్డ -దద్దరిల్లిన పిఠాపురం...-1000 బైకులతో పిఠాపురం నియోజకవర్గంలో భారీ ర్యాలీ

పిఠాపురం శాశ్వత శాసనసభ్యులుగా శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు ఉంటారు అని పిఠాపురం జనసేన శ్రేణులు హర్షధ్వానాలతో హోరెత్తించారు.

భారీ కేక్ ని కట్ చేసిన కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్,కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు







పిఠాపురం:సిటిజన్ టైమ్స్,, మార్చి 14

పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి.జన శ్రేణులు,జనసేన నాయకులు, కార్యకర్తలు మధ్య జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ మహోత్సవములు అత్యంత అద్భుతంగా నిర్వహించారు. శనివారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మాజీ శాసన సభ్యులు పెండెం దొరబాబు, ఓదురి కిషోర్, పిఠాపురం ఉప్పాడ సెంటర్లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పిఠాపురం జనసేన పట్టణ నాయకులు ఏర్పాటుచేసిన జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఉప్పాడ సెంటర్లో భారీ కేక్ కట్ చేసి కోలాహలం నడుమ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. అక్కడి నుండి భారీ బైక్ ర్యాలీతో బయలుదేరి గొల్లప్రోలు చేబ్రోలు మీదుగా పిఠాపురం పట్టణం చేరుకుని మార్గమధ్యలో జనసేన జెండాలను ఆవిష్కరించి పిఠాపురం ఏరియా ఆసుపత్రిలో వృద్ధులకు వికలాంగులకు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పండ్లు మరియు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు,మాట్లాడుతూ జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ తరపున ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పిఠాపురం నియోజవర్గానికి శాశ్వత ఎమ్మెల్యేగా కొణిదెల పవన్ కళ్యాణ్ ఉంటారని, పిఠాపురంలో నిరంతరం జనసేన జెండా రెపరెపలాడుతుందని తెలియజేశారు. ఓటమి నుండి గెలుపు దిశగా వచ్చిన ఏకైక పార్టీ జనసేన పార్టీ అని,అవినీతి మచ్చ లేని పార్టీ జనసేన పార్టీ అని నాయకుడికి తగ్గ ఆలోచనలతో ప్రతి కార్యకర్త నడుచుకోవాలని, తద్వారా రాబోయే రోజుల్లో జనసేన పార్టీ జాతీయ రాజకీయాలకు దగ్గరవుతుందని తెలియజేశారు. పిఠాపురం నియోజకవర్గం లో కొణిదెల పవన్ కళ్యాణ్ సారధ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తద్వారా ఒక మోడల్ నియోజకవర్గంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పిఠాపురం నియోజకవర్గం తయారవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పలు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, పలు వార్డు ఇన్చార్జిలు సర్పంచ్లు ఎంపీటీసీలు జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు, పాల్గొన్నారు.

## మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇళ్ల పంపిణీ: పొంగులేటి



హైదరాబాద్,సిటిజన్ టైమ్స్,మార్చి 14

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగవంతమైంది. మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతతో, వేగంగా జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి భాగ్యం కల్పించడమే లక్ష్యమని, నిధుల కొరత లేకుండా దశలవారీగా అందరికీ ఇళ్లను మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం- చిత్రాడలో సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహణ



పిఠాపురం:సిటిజన్ టైమ్స్, మార్చి 14

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, పిఠాపురం మండలం, చిత్రాడ గ్రామంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కేవలం సంబరాలకే పరిమితం కాకుండా ప్రజా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా జనసేన నాయకులు సామాజిక బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో కేక్ కటింగ్ నిర్వహించి పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే మానవతా దృక్పథంతో పేషెంట్లను పరామర్శించి వారికి పండ్లు మరియు అత్యవసర అవసరమైన వస్తువులను అందజేశారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు జనసేన పార్టీ స్థాపన ప్రజల సంక్షేమం కోసం జరిగిందని, అదే స్ఫూర్తితో ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండి పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిత్రాడ గ్రామంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాలు స్థానిక ప్రజల ప్రశంసలు అందుకున్నాయి.

## లోక్ అదాలత్ లో 417 కేసులు పరిష్కారం





రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 14

లోక్ అదాలత్ లో 417 కేసులు పరిష్కారం అయ్యాయని రామచంద్రపురం మండలం లోక్ అదాలత్ చైర్మన్ మ సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు .శనివారం నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 ప్రకారం దీనికి చట్టబద్ధమైన హోదా ఉందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చే తీర్పులు అంతిమమైనవి మరియు సివిల్ కోర్టు ఇచ్చే డిక్రీ లు గా పరిగణించబడతాయని అన్నారు. కేసులు రాజీ పరిష్కారానికి మీడియేషన్ శిక్షణ పొందిన నలుగురు న్యాయవాదులను కూడా నియమించమన్నారు. ఈ లోక్ అదాలత్ లో సివిల్ కేసులు 57,క్రిమినల్ కేసులు 360 మొత్తం కలిపి 417 కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు . వీటి విలువ రూ.2, 82 , 28,810/- రూపాయలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి .నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఉండవల్లి గోపాలరావు ,బొడ్డు వరాహ నరసింహమూర్తి , న్యాయవాదులు, దొమ్మల పాటి సత్యనారాయణ, కటకం అబ్బురామ్, మండ సత్తి రెడ్డి, సిబ్బంది సుభాషి ,వాసు, కక్షిదారులు పాల్గొన్నారు.

# “పిడిఎస్ బియ్యం అవినీతి అక్రమాలు పై విచారణ చేపట్టాలి బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు”



గొల్లప్రోలు,సిటిజన్ టైమ్స్,మార్చి14:

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలు మండలం బిజెపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ,పట్టణ అధ్యక్షుడు మధు మాట్లాడుతూ,పిడిఎఫ్ బియ్యం అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలి.కోట్లాది రూపాయల ప్రజాధనం అక్రమార్కుల పాలు కాకుండా కాపాడాలి. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలులో కొంతమంది రైస్ మిల్లర్లు కోటా బియ్యం కొనుగోలు చేయడం ద్వారా సీఎంఆర్ కు సంచులు మార్చి పంపించి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించడంపై వెల్లివెత్తుతున్న ఆరోపణలపై జిల్లా ఉన్నత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి.రైస్ మిల్లులను అడ్డుపెట్టుకొని సివిల్ సప్లై అధికారులతో కొమ్మక్కై రేషన్ బియ్యం స్మగ్లింగ్ ద్వారా మిల్లర్లు అక్రమ సంపాదన పై ప్రభుత్వం విజిలెన్స్,ఏసీబీ విచారణ చేపట్టాలి.అనతి కాలంలలోనే గొల్లప్రోలులో కొంతమంది మిల్లర్లు కోట్లకు పడగలెత్త భూములు, భవనాలు కొనుగోలు చేసి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ జలసాలు చేస్తున్న అక్రమార్కులపై లోతుగా విచారణ జరిగితే వారి బండారాన్ని బయట పెట్టాలని బిజెపి డిమాండ్ చేస్తుంది.కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందిస్తున్న పేదల బియ్యాన్ని దోపిడీ చేస్తూ కొంతమంది అధికారులు సహకారంతో అవే బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి పంపించడం ద్వారా మోసాలకు పాల్పడుతున్న మిల్లర్లపై ప్రభుత్వం నిష్పక్షపాత ఎంక్వైరీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి చెబుతుంది. అలాగే గొల్లప్రోలు సివిల్ సప్లై గోడౌన్ లో ప్రజా పంపిణీ నిమిత్తం మిల్లర్లు పంపిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ ద్వారా విచారణ జరిపించి ఎంత మేరా గోడౌన్ లో కోటా బియ్యం నిల్వలు ఉన్నాయో నిగ్గు తేల్చాలని కోరుతున్నాము.తనిఖీలు సమయంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియాను సైతం లోనికి అనుమతించకుండా మిల్లర్లతో కుమ్మక్కై అధికారులు ఇష్టానుసారంగా ప్రవర్తించడానికి ఖండిస్తున్నాం. అలాగే మీడియా ప్రతినిధులపై అక్కడ ఉన్న అధికారులు సిబ్బంది జూలం ప్రదర్శించడంపై పట్టణ బీజేపీ ఆందోళన వ్యక్తం చేస్తుంది.తనిఖీ అధికారులు వ్యవహార శైలి గమనిస్తే మిల్లర్లకు,గోడౌన్ అధికారులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందన్న విషయం తేట తెల్లమయ్యింది. స్వయంగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు గొల్లప్రోలు సివిల్ సప్లై గోడౌన్లు లో తనిఖీలు నిర్వహించి నిజా నిజాలు వెలికి తీయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. అలాగే గొల్లప్రోలు, బి.పత్తిపాడు గ్రామాలలో గడచిన కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పిడిఎస్ మాఫియా ఆగడాలను అరికట్టాలని కోరుతున్నాము. ఎటువంటి తనిఖీలు లేకుండా నేరుగా మిల్లర్స్ నుండి వచ్చిన బియ్యాన్ని గోడౌన్లోకి పంపించడం ఎంతవరకు సమంజసమని భారతీయ జనతా పార్టీ అడుగుతుంది.చంద్రపాలెం నుండి వస్తున్న ఒక వ్యక్తితో పాటు మరి కొంతమంది దళారులు గొల్లప్రోలు సివిల్ సప్లై గోడంలో బియ్యాన్ని రాత్రి సమయాల్లో బయటకు తరలించి అక్రమాలకు అమ్మకాలు చేయడంపై విచారణ చేపట్టాలి.సివిల్ సప్లై గోడౌన్ లో కోట్లాది రూపాయలు ప్రభుత్వ బియ్యం ఉన్న ఇప్పటివరకు ఎటువంటి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంపై బీజేపీ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తుంది. అలాగే సంబంధిత గోడౌనుకు పోలీస్ కాపలా,రక్షణ లేకపోవడంతో బియ్యం గల్లంత అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. గోడౌన్లో సరుకు పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే సీసీ కెమెరాలు, హోంగార్డులు ప్రహర ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు ఎంత సరుకు పోయింది, ఎంత మేర పాత పిడిఎస్ బియ్యం నిల్వలు ఉన్నాయి అనే అంశంపై నిజాయితీ అధికారులతో తనిఖీలు చేయించి వాస్తవాలు బయట పెట్టాలని భారతీయ జనతా పార్టీ కోరుతుంది.

# విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పై నాగబాబు ప్రశంసలు



మైలవరం, సిటిజన్ టైమ్స్, మార్చి 14

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై జనసేన ఎమ్మెల్సీ నాగబాబు ప్రశంసలు కురిపించారు. టీడీపీ నుంచి బాధ్యతగల నాయకుడు ఎదుగుతున్నారని, ఇందుకు లోకేశ్ తీరే నిదర్శనమని ఆయన అన్నారు. మైలవరంలోని పాఠశాలలో జరిగిన పొరపాటుకు మంత్రిగా లోకేశ్ క్షమాపణ చెప్పడం ఆయన బాధ్యతకు, నాయకత్వ లక్షణానికి నిదర్శనమని నాగబాబు పేర్కొన్నారు. మైలవరంలోని తారకరామ నగర్ మండల పరిషత్ మోడల్ స్కూల్‌లో దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపం తలెత్తిందని నాగబాబు వెల్లడించారు. ఇది పాఠశాల స్థాయిలో జరిగిన తప్పిదమైనప్పటికీ, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యత స్వీకరించారని వివరించారు. ఈ ఘటనపై లోకేశ్ స్పందించిన తీరును అభినందిస్తున్నానని తెలిపారు. అంతకుముందు, ఆహార నాణ్యతా లోపంపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, ప్రభుత్వ పాఠశాలలో ఆహార నాణ్యత సరిగా లేదని తన దృష్టికి రాగానే వెంటనే చర్యలు ప్రారంభించామని తెలిపారు. “వెంటనే ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశాం. వారి నివేదిక ఆధారంగా ఫుడ్ ఏజెన్సీని మార్చడంతో పాటు, హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేశాం. పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తాం. తల్లిదండ్రుల నుంచి తక్షణ ఫీడ్‌బ్యాక్ కోసం ‘లీప్’ యాప్‌ను వినియోగిస్తాం” అని వివరించారు. “పిల్లలకు, వారి తల్లిదండ్రులకు నా హృదయపూర్వక క్షమాపణలు. ప్రభుత్వ పాఠశాలల్లోని మన విద్యార్థులకు నాణ్యమైన సంరక్షణ అందేలా చూస్తాం. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం” అని హామీ ఇచ్చారు.

## నారీ శక్తితో - మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన

శ్రీశ్రీ జిల్లా ఎస్పీ

కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్.శ్రీశ్రీ






శ్రీకాకుళం:, సిటిజన్ టైమ్స్ మార్చి 14.

శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో “నారీ శక్తి” కార్యక్రమంలో భాగంగా మహిళలు మరియు పిల్లల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లు పరిధిలో గ్రామాల్లో పోలీసు అధికారులు మహిళలు, విద్యార్థులకు చట్టపరమైన హక్కులు, భద్రతా చర్యలు మరియు జాగ్రత్తల గురించి వివరించారు.మహిళలపై జరుగుతున్న వేదింపులు, గృహ హింస, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, సైబర్ నేరాలు వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే చిన్నారుల రక్షణ కోసం “గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్” వంటి విషయాలపై పిల్లలు మరియు తల్లిదండ్రులు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు కుటుంబ సమస్యలను వివరించారు. మత్తు పదార్థాలు మరియు చెడు వ్యసనాలు వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, “డ్రగ్స్‌కు నో చెప్పాలి” అని పిలుపునిచ్చారు.మహిళలు ఎటువంటి సమస్యలు ఎదురైనప్పటికీ భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, శక్తి యాప్, డయల్ 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాంబేలు సంరక్షణలో ఇంక్యుబేషన్ సెంటర్ల పాత్ర కీలకం

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్





**కాత్రేనికోన సిటిజన్ టైమ్స్ మార్చి 14**

నేల రేవు గచ్చకాయ లపొర, వాసాల తిప్ప, ఎస్ యానం శాక్రిమెంట్ ఆయిల్ సముద్ర తీర ప్రాంతంలో సుమారుగా 50,000 గుడ్లు సేకరించి ఇంక్యుబేషన్ సెంటర్లో 45 రోజులు భద్రపరచగా తొలి దశలో 300 తాబేలు పిల్లలు జన్మించాయని వాటిని శనివారం ఉదయాన్నే గచ్చకా యలపొర వద్ద సముద్రంలో విడిచిపెట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రపు తాబేళ్ల సంరక్షణలో ఇంక్యు బేషన్ సెంటర్ల పాత్ర చాలా కీలకమైనదన్నారు. తీర ప్రాంతాల్లో దొరికిన గుడ్లను సురక్షితంగా పిల్లలుగా మార్చే ప్రక్రియహ్యాచరీ మేనేజ్‌మెంట్' అటవీ శాఖ విభాగం చేపట్టిం దన్నారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా ఐదు దశలు ఉంటాయనీ, మొదటిగా గుడ్ల సేకరణ రవాణా తాబేళ్లు ఇసుకలో గుడ్లు పెట్టి వెళ్ళి పోయిన తర్వాత, కుక్కలు లేదా ఇతర జంతువుల నుండి వాటిని రక్షించడానికి అటవీ శాఖవారు వాటిని సేకరించడం జరిగిందన్నారు గుడ్లను సేకరించేటప్పుడు వాటిని తిప్పకూడదు గుడ్డు లోపల ఉండే పిండం దెబ్బతినకుండా, అది ఏ స్థితిలో ఉందో అదే స్థితిలో గంపలు సంచులలో ఉంచి సెంటర్‌కు తరలించడం జరుగుతుందన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ వి ప్రసాద్ రావు ప్రసంగిస్తూ కృత్రిమ గూళ్ళ నిర్మాణం ఇంక్యుబేషన్ సెంటర్‌లో సహజ సిద్ధమైన గూడును పోలి ఉండేలా ఇసుకలో గుంతలు త వ్వడం జరుగుతుందన్నారు. సాధారణంగా 1.5 నుండి 2 అడుగుల లోతులో, పైభాగం ఇరుకుగా అడుగు భాగం వెడల్పుగా కుండ ఆకారంలోఉండేలా గూడును సిద్ధం చేయడం జరుగుతుం దన్నారు. సేకరించిన గుడ్లను జాగ్రత్తగా ఈ గూడులో ఉంచి, పైన ఇసుకతో కప్పేస్తారన్నారు. ప్రతి గూడుకు ఒక నంబర్ మరియు గుడ్లు పెట్టిన తేదీని గుర్తుగా పెడతారన్నారు. ఇసుక ఉష్ణోగ్రత సుమారు 29 డిగ్రీలు కంటే ఎక్కువగా ఉంటే ఆడ తాబేళ్లు, తక్కువగా ఉంటే మగ తాబేళ్లు పుట్టే అవకాశం ఉంటుందన్నారు. పొదిగే రకాన్ని బట్టి తాబేలు గుడ్లు పిల్లలుగా మారడానికి సాధారణంగా 45 నుండి 60 రోజులు పడుతుందన్నారు. ఈ సమయంలో గూళ్ల చుట్టూ నెట్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది తద్వారా పిల్లలు బయటకు వచ్చినప్పుడు వేరే చోటికి వెళ్లకుండా సురక్షితంగా ఉంటాయన్నారు సముద్రంలోకి విడుదల చేయడం గుడ్ల నుండి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత, వాటిని వెంటనే సముద్రంలోకి వదలడం ఉత్తమం అన్నారు సాధార ణంగా రాత్రి వేళల్లో లేదా తెల్లవారుజామున వీటిని విడుదల చేస్తారన్నారు అదేవిధంగా తెల్లవారుజామున గచ్చకాయలపరు నందు తాబేలు పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు దీనివల్ల పక్షులు లేదా ఎండ వేడి నుండి వాటిని రక్షించవచ్చు నన్నారు. పిల్లలను నేరుగా నీటిలో వేయకుండా, తీరానికి కొంచెం దూరంలో ఇసుకపై వదులుతారన్నారు. దీనివల్ల అవి సముద్రం వైపు పాకుతూ వెళ్తాయన్నారు. అవి పెద్ద య్యాక మళ్ళీ అదే తీరానికి వచ్చి గుడ్లు పెట్టడానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవి కిరణ్ అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన



**అమరావతి, సిటిజన్ టైమ్స్, మార్చి 14:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. అమరావతి పరిధిలోని అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులతో కలిసి ఈరోజు నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గ్రామ కంతాల బయట ఏ తరహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయో, గ్రామాల్లో కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు, నాణ్యమైన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని... పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని నిర్మాణ గడువులపై కూడా నారాయణ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాస భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, 2027 జూన్ నాటికి 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ భవనాలు 2028 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. నిన్ననే ఉండవల్లి వద్ద స్టీల్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన మంత్రి, నేడు నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించడం విశేషం.

# గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలుచేశారు

**అమరావతి, సిటిజన్ టైమ్స్, మార్చి 14**



ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్‌టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# నేడు ప్రాథమిక స్థాయి అక్షరాస్యతా పరీక్ష



**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్,మార్చి 14**

వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 15వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్ష ను అందరి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,13,102 మంది అభ్యాసకులకు అన్ని మండల, మున్సిపాలిటీ పరిధిలో గల గ్రామ, వార్డు లలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, అనుకూలమైన ప్రదేశాలలోని 1462 పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్ష కేంద్రాలలో అంగన్వాడీ టీచర్లు, వెలుగు వి ఓ ఎ లు, జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. అలాగే ప్రశ్నా పత్రాల మూల్యాంకనం కూడా నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అక్షర ఆంధ్ర ఎపీపీ నందు అభ్యాసకులు పొందిన మార్కులను గ్రామ, వార్డు సంక్షేమ సహాయకులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి అక్షరాస్యత పరీక్ష కు అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమంలో నమోదైన 1,13,102 మంది అభ్యాసకులు హాజరై జిల్లాలో శత శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు. పరీక్షకు అభ్యాసకులో హాజరయ్యే విధంగా వాలంటీర్లు, టీచర్లు, వెలుగు, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొనవలసిందిగా కోరారు. పిడి డ్వామా, పి డి ఆర్ డి ఏ, పిడి మెప్మా, పిడి ఐసిడీఎస్, జడ్పీ సీఈఓ, గ్రామ, వార్డు సచివాలయం నోడల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల గ్రామ, మండల మున్సిపల్ స్థాయి అధికారుల సహాయ సహకారంతో ప్రాథమిక స్థాయి అక్షరాస్యతా పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## వృద్ధాప్యంలో కన్నతండ్రిని వేధిస్తున్న కొడుకులు

# కేసు నమోదు చేసిన పోలీసులు

**చిన్నకోడూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

ఆస్తి రాసిచ్చిన తర్వాత కన్నతండ్రిని, తల్లిని పట్టించుకోకుండా, కనీసం తిండి పెట్టకుండా వేధిస్తున్న ఇద్దరు కొడుకులపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి గంగాపూర్ గ్రామానికి చెందిన కొండి నారాయణరెడ్డి (94) కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి సిద్దిపేటలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు పరమేశ్వర్ రెడ్డి గంగాపూర్‌లోనే వ్యవసాయం చేస్తున్నాడు. నారాయణరెడ్డి తనకున్న 7 ఎకరాల భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా (చెరి 3 ½ ఎకరాలు) రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. వయస్సు పైబడటంతో తమను చూసుకుంటారని ఆస్తిని అప్పగించగా, కొడుకులు మాట మార్చారు. తమను ఒక పాత ఇంట్లో ఉంచి, కనీస సౌకర్యాలు కల్పించకుండా, సరిగ్గా తిండి కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎదురుతిరిగి ప్రశ్నిస్తే బూతు మాటలతో తిడుతూ, చంపుతామని బెదిరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్ మానవత్వంతో స్పందించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉన్నందున, అధికారులే నేరుగా నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఫిర్యాదును స్వీకరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేయడం జరిగిందని , చట్టరీత్య తగిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీను ఈ సందర్భంగా తెలిపారు.



# భట్టి విక్రమార్క కుమారుడు కోడలును ఆశీర్వదించిన చంద్రబాబు నాయుడు





**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు విచ్చేసి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షి దంపతులను ఆశీర్వదించారు. ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క – నందిని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. గత మార్చి 5వ తేదీన సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భట్టి విక్రమార్క స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి చంద్రబాబును వివాహానికి ఆహ్వానించారు. అయితే, అప్పట్లో ఉన్న అత్యవసర కార్యకలాపాలు, బిజీ షెడ్యూల్ కారణంగా చంద్రబాబు వివాహానికి హాజరుకాలేకపోయారు. ఈ క్రమంలోనే నేడు ప్రత్యేకంగా ప్రజాభవన్‌కు విచ్చేసి నూతన దంపతులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిల్లా శ్రీధర్ బాబు , వాకిటి శ్రీహరి లు పాల్గొన్నారు.

# స్మశాన పనుల్లో అవినీతి మయం..

## కాంక్రీటు పిల్లర్లకు బదులు స్తంభాలతో సరిపెట్టిన వైనం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ మార్చి 14**

మండలం లోని మొగల్లమూరులో స్మశానంలోనూ అవినీతే కనిపిస్తోంది.. స్మశానం కదా ఎవ్వరూ చూడరను అనుకున్నారో లేక పట్టించుకునే నాధుడే ఎవ్వరూ ఉండరనుకున్నారో మొత్తం మీద అవినీతికి తెరలేపారు. ప్రభుత్వ నిధులను మిగుల్చుకునేందుకు కాంక్రీటు పిల్లర్లు నిర్మించాల్సిన చోట సిమెంటు స్తంభాలతో సరిపెట్టి సగానికి సగం మిగుల్చుకునే ప్రయత్నం చేశారు..ఈ వ్యవహారం స్థానికంగా చర్చకు తెరలేపింది. వివరాల్లోకి వెళితే మొగల్లమూరు గ్రామ పంచాయితీ పరిధిలో మేజర్ మురుగు కాలువను ఆనుకుని ఉన్న స్మశాన వాటికకు గోడ నిర్మించేందుకు ముందస్తుగా కాంక్రీటు పిల్లర్లు నిర్మించేందుకు రూ. 2.40 మంజూరయ్యింది.. అయితే ఈ పనులు నిర్మిస్తున్న కాంట్రాక్టరు నాశీరకం పనులు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. నిజానికి ఈ పనులకు సంబందించి బోర్లు కోసి ఆపై కాంక్రీటుతో స్తంభాలు నిర్మించాల్సి ఉండగా కేవలం బయట దొరికే నాశీరకం కాంక్రీటు స్తంభాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా దాటవేత దోరణిలో సమాధానం చెబుతున్నాడంటున్నారు. మొత్తం మీద స్మశాన వాటికలో కూడా ఈ తరహా నాశీరకం పనులతో అవినీతికి తెరలేపారని ఆరోపిస్తున్నారు.

## ఈనెల 15 చినగానివల్లె లో

# మోల్లాలి స్వామి జాతర ఘనంగా

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 14**

రాచర్ల మండలం చినగానివల్లె గ్రామంలో శ్రీ మోల్లాలి స్వామి జాతరగుతుందని పీర్లచావిడి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది ఈ సందర్భంగా ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ జాతరకు పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నట్లు అందుకు తగిన ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

# రోగాలకే చుక్కలు చూపించే ఆకు కూర



ఆకు కూరల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. వీటిని రెగ్యులర్‌గా తినాలని సూచిస్తున్నారు డైటీషియన్లు..అలాంటి ఆకు కూరల్లో చుక్క కూర (ఖట్టా పాలక్) ఒకటి.. చుక్కకూర, సాధారణంగా వంటకాల్లో పుల్లని రుచి కోసం ఉపయోగించే ఆకుకూర.. వాస్తవానికి అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది కేవలం నోటికి రుచిని ఇవ్వడమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, వివిధ ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఆకుకూరను రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే లాభాలను వివరంగా తెలుసుకుందాం.

**పోషకాల గని చుక్కకూర:**
చుక్కకూరలో విటమిన్‌లు ం, అ సమృద్ధిగా ఉంటాయి. అంతేకాకుండా, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. బీటా కెరోటిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా చుక్కకూరలో అధిక మోతాదులో ఉంటాయి. ఈ పోషకాలన్నీ శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**చుక్కకూర ప్రయోజనాలు..**

జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది: చుక్కకూర జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నీళ్ల విరేచనాలు తగ్గించడానికి, మలబద్ధక సమస్యను దూరం చేయడానికి ఇది చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.
శరీరానికి చలువ: శరీరం వేడిగా ఉన్నప్పుడు, చుక్కకూరను ఆహారంలో తీసుకోవడం వల్ల ఒంట్లో వేడి తగ్గుతుంది.. శరీరం చల్లబడుతుంది. అధికంగా దప్పిక వేసేవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవడం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చు. వాంతులు ఎక్కువగా అవుతున్నప్పుడు చుక్కకూరతో చేసిన వంటకాలు తినడం వల్ల వాంతులు తగ్గుతాయి.

**గుండె ఆరోగ్యం:** చుక్కకూరలో ఉండే ఐరన్ శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను సమర్థవంతంగా చేరవేయడానికి సహాయపడుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని తగ్గించి, గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. అధిక రక్తపోటు సమస్య ఉన్నవారికి కూడా చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.
రోగనిరోధక శక్తి పెంపు: విటమిన్ అ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల చుక్కకూర శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది క్యాన్సర్ కణాల వృద్ధిని నియంత్రించడంలో సహాయపడి, క్యాన్సర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది.

**షుగర్, కిడ్నీ రోగులకు కూడా మంచిది:** షుగర్ వ్యాధిగ్రస్తులకు చుక్కకూర చాలా మంచిది. ఇంకా కిడ్నీల సమస్యలు ఉన్నవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవచ్చు. రక్తహీనతతో బాధపడేవారికి చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది.. ఇది ఎర్ర రక్త కణాల వృద్ధికి తోడ్పడుతుంది.

**పుల్లని రుచి కలిగిన చుక్క కూరను ఈజీగా చేసుకోవచ్చు..**
చుక్క కూరను చాలా సింపుల్ గా జ్యూసీగా వండుకోవచ్చు.. చుక్కకూర కాడలు లావుగా, ఆకులు మందంగా, వెడల్పుగా ఉంటాయి. దాని పుల్లని రుచి ప్రత్యేకతను తీసుకువస్తుంది. దీనిలో రెండు టమోటాలను జోడించడం ద్వారా.. రుచి మరింత పెరుగుతుంది. ఈ అద్భుతమైన ఆకుకూరను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు

తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు.ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు. 'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?! ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధులనైనా నయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేక? ఇలా రకరకాల కారణాలతో రోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలు? యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు
ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20-30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస



ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.యువతలో బలహీనతన్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోట ఎక్కువ సేపు కూర్చుని ఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్ ?స్టైల్‌నిమీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. పీడిస్తున్న మధుమేహంజీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్త అలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం
దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనాలజీ విభాగం గణాంకాల ప్రకారం, టైప్-2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయాబెటిస్ ఉందన్న విషయమే తెలియకపోవడం గమనార్హం. అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

# బరువు తగ్గాలనుకునే వారికి అసలు గ్రీన్ టీ ఎలా సహాయం చేస్తుంది..



అధికంగా ఉండే మన శరీర బరువే అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ విషయాన్ని వైద్యులు తరుచూ చెబుతూ ఉండడంతో మనలో చాలా మందికి ఆరోగ్యం మీద స్పృహ వచ్చిందనే చెప్పవచ్చు.దీంతో శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి మనలో చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం, కఠినమైన ఆహారాన్ని తీసుకోవడం, తగినంత నీటిని తాగడం, అధిక క్యాలరీలను తగ్గించడం, ఇష్టమైన ఆహారాన్ని వదులుకోవడం ఇలా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బరువు తగ్గాలని ఆహారాన్ని కూడా తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దీంతో ఆకలితో అనేక బాధలు పడుతూ ఉంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు అనవసరమైన ఆకలి బాధలు పడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆకలి బాధలను నియంత్రించడానికి ఒక చిట్కాను కూడా చెబుతున్నారు.ఆకలిని నియంత్రిస్తుంది..బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు గ్రీన్ టీని తీసుకోవడం మంచిదని వారు చెబుతున్నారు. గ్రీన్ టీ లో ఎపిగాల్లోకాచెటిన్ గాలేట్ ( ఇజిసిజి) అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించే అడిపోనెక్టిన్ అనే హార్మోన్ ను ఎక్కువగా ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఆకలి నియంత్రణలో ఉండడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. చాలా మంది బరువు తగ్గాలనుకున్నప్పటికీ ఆకలిని నియంత్రించుకోలేక ఏదో ఒకటి తింటూ ఉంటారు. అలాంటి వారు గ్రీన్ టీని తీసుకోవడం వల్ల ఆకలి తగ్గి బరువును అదుపులో ఉంచుకోగలుగుతారు. అలాగే కొందరిలో విపరీతమైన ఆకలి ఉంటుంది. ఆకలిని వాళ్లు అస్సలు తట్టుకోలేక ఎప్పుడూ చూసినా తింటూనే ఉంటారు. అలాంటి వారు కూడా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.చక్కెర స్థాయిలు అదుపులో..మీరు ఆకలిని నియంత్రించుకోవాలనుకుంటే ఇజిసిజి అధికంగా ఉండే గ్రీన్ టీని తాగడం మంచిది. అంతేకాకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారు గ్రీన్ టీని తాగడంతో పాటు అనవసరమైన ఆకలిని నియంత్రించుకోవడానికి భోజనానికి ముందు ఇసాబ్‌గోల్ తీసుకోవడం చేయాలి. అలాగే ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్, ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. దీంతో ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే ప్రయాణానికి ఆకలి బాధలు అడ్డుగా ఉండకూడదు అనుకునే వారు ఆకలిని నియంత్రించుకోవాలనుకునే వారు ఈ చిట్కాను పాటించడం మంచిది.

**పొట్ట చుట్టూ సమస్యలే**
ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం, అస్థిర జీవనశైలి తదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30-40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.

**క్యాన్సర్ దాడి**
ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10-15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

**వారిపై తీవ్ర ప్రభావం**
మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. జబ్బు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు.

**ఆర్థికంగా దెబ్బ**
కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం. ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారం కుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఇలా జరగొద్దంటే?ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించాలి. అందుకు తగ్గ జీవనశైలిని పాటించాలి. వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల.. పెను ముప్పును తప్పించుకోవచ్చు.

# 14 రోజులు మానేస్తే..



పంచదార మన ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అదేమీ పట్టించుకోకుండా టీ, కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ పేరుతో ఏదో ఓ రూపంలో తినేస్తుంటారు. అతిగా తీసుకుంటూ బరువుతో పాటు షుగర్ లెవల్స్ పెంచుకుంటూ చాలామంది అనారోగ్యానికి గురవుతుంటారు.అయితే చక్కెరను కనీసం 14 రోజులు పూర్తిగా మానేస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలుసుకుందాం.తినే పదార్థాల్లో చెక్కర వేసుకోవడం వల్ల కేవలం కేలరీలు మాత్రమే పెరుగుతాయనుకుంటారు. అది మాత్రమే కాదు ఆకలి, క్రేవింగ్స్, ఇన్సులిన్, లివర్ ఫ్యాట్ లాంటి ఎన్నో సమస్యలు మెల్లగా అంటుకుంటాయి. అయితే, చక్కెరకు దూరంగా ఉండటం చెప్పినంత తేలిక కాదు. షుగర్ మానేయగానే ముందుగా క్రేవింగ్స్ పుడతాయి. దీంతోపాటు తలనొప్పి, అలసట, ఇరిటేషన్, మెదడు పనితీరు తగ్గడం వంటి సమస్యలూ పలకరిస్తాయి. ఎప్పుడెప్పుడు చక్కెరను నోట్లో వేసుకుందామా అనిపిస్తుంటుంది.అయితే, కాస్త ఓపిక పడితే చక్కెరను దూరం పెట్టమని మన శరీరానికి మెదడు చెబుతుంది. అలా ఓ 14 రోజులు చక్కెరకు పూర్తి దూరం పాటిస్తే? బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది. ఫాస్టింగ్ గ్లూకోజ్ ఇంప్రూవ్ అవుతుంది. మెటబాలిజంలో మార్పు వస్తుంది. లివర్ షుగర్ తగ్గుతుంది. చక్కెర మానేయడం పెద్ద కష్టమేమీ కాదు. రోజంతా ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. పండ్లు పుషలంగా తినొచ్చు. ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, చెక్కరతో చేసిన పదార్థాలకు మాత్రం దూరం పాటిస్తే సరి. ఈ పద్నాలుగు రోజులు సాఫ్ట్‌డ్రింక్స్, జ్యూస్‌లు, స్వీటెన్డ్ ఆల్కహాల్ లాంటి వాటిని తీసుకోవద్దు. ఒకసారి ప్రయత్నించి చూడండి.

# డబుల్ డిన్నర్ ట్రబుల్స్



ఆలస్యంగా తినడం అందరి సమస్యే. ఒక్కోసారి సమయం కలిసొచ్చి.. తినాల్సిన సమయం కంటే ముందే తింటారు. ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి పని చేసేవాళ్లకు అర్ధరాత్రి మళ్లీ ఆకలవుతుంది.రాత్రి రెండో డిన్నర్ లాగించేస్తారు. తరచుగా డబుల్ డిన్నర్ తినేవాళ్లకు ఆకలి సమస్యలు ఉంటాయి. నిద్రలేమి, అధిక బరువు అదనపు సమస్యలు తప్పవని ఆహార నిపుణులు హెచ్చరి స్తున్నారు.ఓటీటీలో షోలు చూస్తూ, థియేటర్లో సినిమాలు, క్రికెట్ మ్యాచ్‌లు, మ్యూజిక్ కాన్సర్ట్, ట్రావెల్, రాత్రి వేళ ఉద్యోగ విధులు చేసేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ సమస్య ఎదుర్కొంటున్నారు. డిన్నర్ సరైన సమయానికే చేసినా.. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఉండటం వల్ల వీళ్లకు మళ్లీ ఆకలవుతుంది. అప్పుడు భోజనం, లేకపోతే ఇష్టమైన స్నాక్స్‌ని కడుపునిండా ఆరగిస్తారు. అప్పటికే మొదటి డిన్నర్ ద్వారా శరీరానికి కావాల్సినంత ఎనర్జీ అందుతుంది.(సెకండ్) డిన్నర్‌కి నిద్ర పోవడానికి మధ్య తక్కువ సవయం ఉంటే తిన్నది జీర్ణం కాదు. ఫలితంగా నిద్ర సరిగ్గా పట్టదు. రెండోసారి తిన్నది శరీర అవసరాలకు ఉపయోగపడదు. అప్పటికే మొదటి డిన్నర్ నుంచి తయారైన గ్లూకోస్ శరీరానికి కావాల్సిన శక్తినిస్తుంది. సెకండ్ డిన్నర్‌లో తిన్న ఆహారం జీర్ణమైన తర్వాత కొవ్వుగా మారి, శరీర బరువును పెంచుతుంది. పార్టీలు, స్నేహితులతో షికార్లు చేస్తూ డాబా హోటళ్లు, రెస్టారెంట్లలో అర్ధరాత్రి తినేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ ఆరగించేవాళ్లే! ఇలా తినడం సరదాగా ఉంటుంది. కానీ, ఆరోగ్యానికి మాత్రం తీవ్రంగా హాని చేస్తుంది.సమయానికి పడుకునేవాళ్లకు తొందరగా రాత్రి భోజనం చేయడం మేలు చేస్తుంది. కానీ, ఆలస్యంగా పడుకునేవాళ్లు తొందరగా భోజనం చేస్తే ఆకలి సమస్య, అమితంగా తినడం సమస్యలు తప్పవు. కాబట్టి పడుకునే వేళల్ని, తినే వేళల్ని వృత్తికి తగ్గట్టుగా మార్చుకోవాలి.ఎన్ని గంటలకు పడుకుంటారో, దానికి మూడు గంటల ముందు తినడానికి ప్లాన్ రెడీ చేసుకోవాలి.రాత్రివేళ ఒకేసారి తినే పద్ధతి పాటించాలి. పగలు తిన్నట్టుగా భోజనం తర్వాత మరేదీ తినకూడదు.తిన్న తర్వాత నడవడం, ఏదైనా చిన్న పని చేస్తూ ఉండాలి. అప్పుడు తిన్న ఆహారం జీర్ణమవుతుంది. అధిక బరువు, ఆకలి, నిద్ర సమస్యలు ఉండవు.రాత్రి భోజనంలో ప్రొటీన్, ఫైబర్, హెల్తీ ఫ్యాట్ ఉండేలా చూసుకుంటే తేలికగా జీర్ణమవుతుంది. ఆకలి సరిగా ఉంటుంది.

# 'బేబీ' జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?

టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటూ.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.



ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.



సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**

అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచుర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి.ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి.ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



# ప్రపంచ్ కప్ అయినా కూడా ఇలా తొండి చేయొద్దు

## రనౌట్ వివాదంపై కైఫ్ సంచలన కామెంట్స్




పాక్–బంగ్లా మధ్య జరిగిన వండే మ్యాచ్ లో రనౌట్ వివాదం ఇప్పట్లో ముగిసేలా లేదు. పాకిస్తాన్ బ్యాటర్ అలీ ఆఘా ఔటైన విధానంపై క్రికెట్ సర్కిల్ లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్ కెప్టెన్ మెహ్దీ హాసన్ మిరాజ్ చేసిన పని గల్లీ క్రికెట్ కంటే ఘోరంగా ఉందని ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదంపై ఇండియన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

బంగ్లా కెప్టెన్ మెహ్దీ హాసన్ చేసింది క్రీడాస్ఫూర్తికే విఘాతం కలిగించేలా ఉందని సీరియస్ కామెంట్స్ చేశారు కైఫ్. ఇది జరగాల్సింది కాదు. వికెట్స్ పడటం లేదనే నిరాశలో ఇంతకు దిగజారటం కరక్టేనా..? వికెట్లు పడటం లేదని ఇలాంటి రనౌట్ సమర్థించాలా..? అది కూడా ఒక కెప్టెన్ చేయడమేంటి..? యంగ్స్ స్టర్స్ నేర్చుకోండి.. ప్రపంచ కప్ ఉన్న కూడా బంగ్లా కెప్టెన్ చేసినపని చేయకండి. నిజాయితీ లేని ఆటలు అవి ఆటలే కావు.. అంటూ మండిపడ్డారు కైఫ్

**వివాదం ఏంటి..?**

పాకిస్తాన్–బంగ్లాదేశ్ మధ్య శుక్రవారం (మార్చి 13) జరిగిన మ్యాచ్ లో రనౌట్ తీవ్ర వివాదాస్పదం అయ్యింది. ఢాకాలోని షేర్–ఇబంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు ఫుల్ ట్రెండింగ్ లో ఉంది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ముందుగా బ్యాటింగ్ చేయగా.. మహమ్మద్ రిజ్వాన్(44)తో కలిసి సల్మాన్ అలీ ఆఘా (64) నాలుగో వికెట్‌కు 109 పరుగుల పాట్నర్ షిప్ నెలకొల్పాడు. వికెట్ పడకుండా ఆడుతూ బంగ్లా బౌలర్లకు చుక్కలు చూపించారు. ఎంతకూ వికెట్ పడటం లేదనో ఏంటో కానీ.. అవకాశం వచ్చింది కదా అని క్రీడాలోకం నవ్వుకునే పని చేశాడు బంగ్లా కెప్టెన్ మెహ్‌దీ హసన్ మిరాజ్. 39వ ఓవర్‌లో మహమ్మద్ రిజ్వాన్ బౌలర్‌వైపు షాట్ ఆడాడు. బంతి కాస్త నాన్‌స్ట్రైకర్‌లో ఉన్న సల్మాన్ అలీ అఘా బ్యాట్‌కు తాకింది. దాంతో ఆ బంతిని సల్మాన్ అలీ అఘా బౌలర్‌కు అందించే ప్రయత్నం చేశాడు.కానీ మెహ్‌దీ హసన్ మిరాజ్ వేగంగా బంతిని అందుకొని నాన్‌స్ట్రైకర్ వికెట్లను కొట్టి రనౌట్ కోసం అప్పీల్ చేశాడు. దాంతో సల్మాన్ అఘా అవాక్కయ్యాడు. బంతిని అందించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలనుకున్న అతనికి ఈ అనూహ్య ఘటన తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్ రివ్యూ కోరగా బ్యాటర్ క్రీజు బయటే ఉన్నాడని ఔటిచ్చాడు.దాంతో తీవ్ర అసహనానికి గురైన సల్మాన్ అఘా.. బంగ్లా ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. పెవిలియన్ చేరుతూ బ్యాట్, గ్లౌజులను నేలకు కొట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ముందుంది ముసళ్ల పండుగ: గంభీర్‌కు దాదా వార్నింగ్



రెండు ఐసీసీ ట్రోఫీలు సాధించిన తొలి టీమిండియా కోచ్ గా గౌతమ్ గంభీర్ రికార్డు సృష్టించాడు. టీ20 వరల్డ్ కప్–2026 తో పాటు, చాంపియన్స్ ట్రోఫీ–2025 గంభీర్ ఖాతాలో పడ్డాయి. టీమ్ లో మార్పులు చేర్పులతో గందరగోళానికి గురిచేస్తున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. టీ20 కప్ వచ్చాక గంభీర్ మీద ఉన్న ఆరోపణలు దాదాపు తగ్గిపోయాయి. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఇచ్చిన వార్నింగ్ చర్చనీయాంశంగా మారింది. ముందుంది ముసళ్ల పండుగ అంటూ హెచ్చరించాడు దాదా. వైట్ బాల్ క్రికెట్ లో భాగంగా 2027 ప్రపంచ కప్ అత్యంత సవాళ్లతో కూడుకున్నదిగా గంగూలీ అభివర్ణించాడు. గంభీర్ కు అసలైన పరీక్ష 2027లో సౌతాఫ్రికాలో మొదలవుతుంది. అక్కడ పరిస్థితులు గంభీర్ ను టెస్ట్ చేస్తాయి. కానీ అతనికి ఉన్న టీమ్ తో దాన్ని సాధిస్తాడనే నమ్మకం ఉంది.. అంటూ మనీ కంట్రోల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బొరియా మజుందార్ తో అన్నాడు దాదా.

ఇండియాకు 2023 వరల్డ్ కప్ ఇప్పటికీ నోటి దాకా వచ్చి చేజారిన ముద్ద లాంటిది. ఎందుకంటే సీజన్ మొత్తం అద్భుతంగా రాణించి.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. ఆ సిరీస్ లో ఇండియా గేమ్ చూసి కప్ మనకేనని ఫ్యాన్స్ భావించారు.

ఒక ప్లేయర్ గా 2011 వరల్డ్ కప్ గెలిచిన గంభీర్.. కోచ్ గా 2027 లో వరల్డ్ కప్ ఎదుర్కోవడం సవాళ్లతో కూడుకున్న విషయమేనని గంగూలీ అన్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి సీనియర్ అనుభవజ్ఞులు ఉండటం కలిసొచ్చే అంశంగా అభిప్రాయపడ్డాడు.


అదే విధంగా గంభీర్, అతని టీమ్ రెడ్ బాల్ క్రికెట్ లో ఇంకా ఇంప్రూవ్ కావాల్సి ఉందన్నాడు. దానికి ఏకైక మార్గం వికెట్ గురించి తక్కువగా ఆలోచించడమేనన్నాడు. గంభీర్ కు కాస్త టైమ్ ఇవ్వాలని బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందే చెప్పినట్లు గుర్తు చేశాడు. వైట్ బాల్ క్రికెట్ లో కోచ్ గా ప్రూవ్ చేసుకున్నాడని.. కానీ రెడ్ బాల్ క్రికెట్ లో.. అంటే టెస్టులలో మెరుగవ్వాల్సి ఉందని సలహా ఇచ్చాడు దాదా.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెవిన్ పీటర్సన్ గుడ్ బై.. కామెంటరీ బాక్స్‌లో కలుసుకుందాం అంటూ కామెంట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఫ్రాంచైజీకి వీడ్కోలు పలుకుతున్నట్టు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. జట్టు మెంటార్ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించాడు. అయితే, ఈ లీగ్ లో గతంలో మాదిరే కామెంటేటర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశాడు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించింది. హెడ్ కోచ్ హేమాంగ్ బదానీ, అసిస్టెంట్ కోచ్ మాథ్యూ మోట్, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ వంటి సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి కేపీ పనిచేశాడు. "ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటార్‌గా కొనసాగలేను. ఈ బాధ్యతలకు అవసరమైన సమయాన్ని కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ శుభాకాంక్షలు. అయితే, కామెంటరీ బాక్స్‌లో మళ్లీ కలుస్తాను" అని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశాడు.దక్షిణాఫ్రికాలో జన్మించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున 104 టెస్టులు, 136 వన్డేలు ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచి ఇంగ్లండ్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణే జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

ఇదిలా ఉండగా,

బీసీసీఐ ఐపీఎల్ 2026 తొలి దశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు 20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా పూర్తి షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని బీసీసీఐ తెలిపింది.



Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776